సాక్షి తిరుపతి

శుక్రవారం । 16 । జూన్ । 2023



రైళ్ల రాకపోకలకు అంతరాయం

జాతీయ రహదారి విస్తరణ పనుల్లో భాగంగా సుమారు ఏడు గంటల పాటు రైళ్ల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగింది. - 8లో



జగనన్న పాలన దేశానికే ఆదర్శం

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన దేశానికే ఆదర్శమని చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి తెలిపారు. - 8లో

	గరిష్టం	కనిష్టం
తిరుపతి	42	29
చిత్తూరు	40	27
తిరుమల	37	24
గూడూరు	43	31
నగరి	42	29

న్యూస్‌రీల్

23 నుంచి ధర్మరాజుల స్వామి బ్రహ్మోత్సవాలు



ఏర్పాట్లను పరిశీలిస్తున్న పాలకమండలి చైర్మన్ అంజూరు శ్రీనివాసులు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా చెన్నై రోడ్డులో వెలసిన శ్రీద్రౌపతీ సమేత ధర్మరాజుల స్వామి బ్రహ్మోత్సవాలను ఈనెల 23 నుంచి అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్టు ఆలయ పాలకమండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు తెలిపారు. గురువారం ఆయన ఆలయంలోని ఏర్పాట్లను పరిశీలించారు. పదిరోజుల పాటు జరిగే ఈ ఉత్సవాలను వైభవంగా నిర్వహించనున్నట్టు తెలిపారు. ఈ ఏడాది అగ్నిగుండం తొక్కే భక్తులకు కంకణానికి వసూలు చేసే రుసుం పూర్తిగా ఉచితమన్నారు. కార్యక్రమంలో ప్రత్యేక ఆహ్వానితులు చింతామణి పాండు, ఆలయ ఇంజినీరింగ్ ఏఈ వేణుగోపాల్‌రెడ్డి, వర్క్ ఇన్‌స్పెక్టర్ బాలాజీ, ప్రముఖులు భాస్కర్ ముదిరాజ్, పసల కుమారస్వామి, బాలిశెట్టి నరసింహులు, ఆలయ పూజారి పురుషోత్తం పాల్గొన్నారు.

ఆగస్టు 31కి భూసర్వే పూర్తి



పీవీ జయరాజ్, జిల్లా సర్వే అధికారి

తిరుపతి అర్బన్: ఈ ఏడాది ఆగస్టు 31వ తేదీ నాటికి జగనన్న భూసర్వే ప్రక్రియ పూర్తిచేస్తామని సర్వే జిల్లా అధికారి పీవీ జయరాజ్ తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ జిల్లాలో 1,030 గ్రామాల్లో సర్వే చేయాల్సి ఉందన్నారు. మూడవ దశ సర్వేకు సంబంధించి 768 గ్రామాల్లో సర్వే చేపట్టాల్సి ఉందని తెలిపారు. ప్రస్తుతం మండల సర్వేయర్లతోపాటు జగనన్న భూసర్వేకు ఏర్పాటు చేసిన 375 మంది సర్వేయర్లు సర్వే చేస్తున్నారని వివరించారు.

శ్రీవారి దర్శనానికి 24 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ అధికంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 31 కంపార్ట్‌మెంట్లు నిండాయి. బుధవారం అర్ధరాత్రి వరకు 78,487 మంది స్వామివారిని దర్శించుకోగా.. 38,213 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.3.76 కోట్లు లభించాయి. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతుండగా.. దర్శన టిక్కెట్లు లేని భక్తులకు 24 గంటల సమయం పడుతోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లోనే దర్శనం లభిస్తోంది.

డీఎస్‌ఓ బదిలీ



రఘువీర్



శేషాచలంరాజు

తిరుపతి అర్బన్: తిరుపతి జిల్లా సివిల్ సప్లయ్ అధికారిగా(డీఎస్‌వో) పనిచేస్తున్న శేషాచలం రాజును చిత్తూరు జిల్లాకు బదిలీ చేశారు. కర్నూల్ జిల్లా డీఎస్‌వోగా పనిచేస్తున్న రఘువీర్‌ను తిరుపతి జిల్లా డీఎస్‌వోగా నియమిస్తూ కమిషనర్ అనీల్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. అయితే ఈనెల 30వ తేదీ వరకు సెలవులో ఉన్న రఘువీర్ జూలై 1వ తేదీన తిరుపతి డీఎస్‌వోగా బాధ్యతలు స్వీకరించనున్నారు. అప్పటి వరకు శేషాచలం రాజు కొనసాగనున్నారు. చిత్తూరు ఏఎస్‌వోగా ఉన్న శేషాచలం రాజుకు రెండు నెలల క్రితం తిరుపతి డీఎస్‌వో బాధ్యతలు అప్పగించారు. ఆయన తిరిగి చిత్తూరు ఏఎస్‌వోగా బదిలీపై వెళ్లనున్నారు.

అందరికీ ఉపాధి



వర్చువల్ విధానంలో అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ వెంకటరమణారెడ్డి

తిరుపతి అర్బన్: మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా అందరికీ ఉపాధి పనులు కల్పించాలని కలెక్టర్ కే.వెంకటరమణారెడ్డి సూచించారు. గురువారం కలెక్టరేట్ నుంచి జాతీయ ఉపాధి హామీ పథకం కింద చేపడుతున్న వివిధ కార్యక్రమాలపై, గడపగడపకు మన ప్రభుత్వం కింద మంజూరైన పనుల పురోగతిపై వర్చువల్ విధానంలో సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఉపాధి పనుల్లో ఎస్సీ, ఎస్టీలకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. వలసలకు తావులేకుండా స్థానికంగానే ఉపాధి కల్పించాలని చెప్పారు. ప్రస్తుతం ఉపాధి కూలీ సరాసరి రూ.263 ఉందని, దీన్ని రూ.272 పెంచాలని చెప్పారు.

సత్యవేడు జూనియర్ కళాశాలలో జగనన్న ఆణిముత్యాలతో ఎమ్మెల్యే ఆదిమూలం



సూళ్లూరుపేట జెడ్పీ ఉన్నత పాఠశాలలో మెమెంటో అందజేస్తున్న ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య



ఆణిముత్యాల పండుగ

జిల్లా వ్యాప్తంగా జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమాన్ని పండగ వాతావరణంలో నిర్వహించారు. నియోజకవర్గ స్థాయిలో ఏర్పాటు చేసిన కార్యక్రమాలకు ఆయా నియోజకవర్గాల ఎమ్మెల్యేలు, నేతలు హాజరయ్యారు. పది, ఇంటర్‌లో ఉత్తమ మార్కులు సాధించిన ప్రతిభావంతులను ఆత్మీయంగా సత్కరించారు. నగదు బహుమతులు, మెమెంటోలు, మెడల్స్ అందించి ప్రోత్సహించారు. జగనన్న ప్రభుత్వం చదువుకు పెద్ద పీట వేస్తోందని.. పేద పిల్లలు ఉన్నత చదువులు చదివి తల్లిదండ్రులకు మంచి పేరు తేవాలని సూచించారు. నిత్యం వెన్నుతట్టి ప్రోత్సహించిన ఉపాధ్యాయులనూ ఆప్యాయంగా సత్కరించి.. అభినందించారు. కార్యక్రమాలకు తరలివచ్చిన తల్లిదండ్రులకు రుచికరమైన వంటకాలతో మధ్యాహ్న భోజనాన్ని వడ్డించారు.

- ప్రతి నియోజకవర్గంలోనూ ప్రత్యేక కార్యక్రమాలు
- ప్రతిభావంతులకు సత్కారాలు
- నగదు బహుమతులతో ప్రోత్సహించిన నేతలు
- భారీగా హాజరైన తల్లిదండ్రులు

తిరుపతి అర్బన్: 'బిడ్డకు మనం ఇచ్చే గొప్ప ఆస్తి చదువు. డబ్బుల్లేవని ఏ ఒక్కరూ చదువుకు దూరం కారాదు. ప్రతి ఇంటి నుంచి గొప్పగొప్ప డాక్టర్లు, ఇంజినీర్లు, కలెక్టర్లు రావాలి. అప్పుడే ఆ ఇల్లు, ఊరు, రాష్ట్రం బాగుంటుంది. అందుకే చదువు కోసం ఎన్నికోట్లయినా ఖర్చుచేస్తాం. మీరు చదవండి.. మేం చదివిస్తాం' అంటూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చదువుకు అత్యధిక ప్రాధాన్యత ఇచ్చారు. వినూత్న పథకాలతో విద్యార్థులకు ఎక్కడా ఇబ్బందులు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. చదువుకోవడానికి ఆహ్లాదకర వాతావరణం ఉండేలా నాడు–నేడుతో పాఠశాలల రూపురేఖలే మార్చేశారు. ఇప్పుడు విద్యార్థులను మరింత ప్రోత్సహించేందుకు జగనన్న ఆణిముత్యాల పేరుతో వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు నగదు బహుమతులతోపాటు మెమెంటోలు అందించాలని నిశ్చయించారు. ఈ నేపథ్యంలో గురువారం జిల్లా వ్యాప్తంగా జరిగిన కార్యక్రమాల్లో పది, ఇంటర్‌లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను నేతలు, విద్యాశాఖ అధికారులు ఆప్యాయంగా సత్కరించి అభినందించారు.

- గూడూరులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన కార్యక్రమానికి స్థానిక ఎమ్మెల్యే వెలగపల్లి వరప్రసాద్‌రావుతోపాటు స్వచ్ఛాంద్ర రాష్ట్ర చైర్‌పర్సన్ పానకా దేవసేనమ్మ పాల్గొన్నారు. ప్రతిభావంతులైన పిల్లలను సత్కరించారు.
- పుత్తూరు ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో జరిగిన నియోజకవర్గ స్థాయి జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమానికి భారత సినీ కార్మికుల సమాఖ్య (ఫెఫ్సీ) అధ్యక్షుడు, రాయలసీమ వీవర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆర్‌కే సెల్వమణి హాజరయ్యారు. పదో తరగతి పరీక్షల్లో వడమాలపేట మండలం, ఎస్‌బీఆర్ పురం హైస్కూల్ విద్యార్థిని చాందిని, పుత్తూరు మండలం, రాచపాళెం హైస్కూల్‌కు చెందిన మయూరి, నింద్ర మండలం, కొత్తూరు జెడ్పీ హైస్కూల్‌కు చెందిన ఝాన్సీ తోపాటు ఇంటర్మీడియెట్ విభాగంలో నగరి ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చెందిన జ్ఞానపూర్ణిమ, సంధ్య, పుత్తూరు ఏపీ రెసిడెన్షియల్ స్కూల్‌కి చెందిన తనుజ, స్రవంతికి నగదు బహుమతులు అందించారు.
- చంద్రగిరి ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో జరిగిన జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమానికి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి తనయుడు హర్షిత్‌రెడ్డి ముఖ్యఅతిథిగా విచ్చేశారు. పదో తరగతిలో మొదటి మూడు స్థానాల్లో నిలిచిన ముగ్గురిని, ఇంటర్‌లో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, హెచ్‌ఈసీ గ్రూపుల్లో ప్రథమ స్థానంలో నిలిచిన మొత్తం నలుగురు విద్యార్థులకు నగదు బహుమతితోపాటు, ప్రశంసా పత్రాలు, మెమెంటోలు అందించి సత్కరించారు.
- సూళ్లూరుపేట నియోజకవర్గ స్థాయి జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమాన్ని స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్వహించారు. పది, ఇంటర్‌లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రశంసా పత్రాలు, మెమెంటోలను స్థానిక ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య అందజేశారు. తడ మండలం, చిన్నమాంబట్టు జెడ్పీ హైస్కూల్‌కు చెందిన ఒకరు, పెళ్లకూరు మండలం, తాళ్వాయిపాడు జెడ్పీ స్కూల్‌కు చెందిన ఇద్దరు, నాయుడుపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఒకరు, దొరవారిసత్రం గురుకుల పాఠశాల జూనియర్ కళాశాలకు చెందిన ముగ్గురు విద్యార్థులకు మెడల్స్ అందించారు.
- శ్రీకాళహస్తి పట్టణంలోని బాలికోన్నత పాఠశాలలో జరిగిన కార్యక్రమానికి స్థానిక ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి కుమార్తె బియ్యపు పవిత్రారెడ్డి హాజరయ్యారు. పదో తరగతిలో జిల్లా స్థాయిలో ఉత్తమ మార్కులు సాధించిన నలుగురు విద్యార్థులకు నగదు పురస్కారంతో పాటు మెమెంటోలతో సత్కరించారు.
- సత్యవేడు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జరిగిన కార్యక్రమానికి స్థానిక ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం హాజరయ్యారు. ఇంటర్‌లో ఉత్తమ మార్కులు సాధించిన నలుగురితో పాటు పదోతరగతిలో ఉత్తమ శ్రేణిలో ఉత్తీర్ణులైన 38 మందికి నగదు బహుమతులందించారు. అనంతరం వారిని సత్కరించారు.



పుత్తూరు: సత్కారం అందుకున్న జగనన్న ఆణిముత్యాలతో ఆర్కే సెల్వమణి



గూడూరు: విద్యార్థిని సత్కరిస్తున్న ఎమ్మెల్యే వరప్రసాద్‌రావు



చంద్రగిరి: ప్రతిభకనబరిచిన విద్యార్థులతో చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి



శ్రీకాళహస్తి: విద్యార్థినికి జ్ఞాపిక అందజేస్తున్న బియ్యపు పవిత్రారెడ్డి

సుడిమాను అవరోహణం



అమ్మవారి ఆలయంలో సుడిమానును అవరోహణం చేస్తున్న సిబ్బంది



చెంగాళమ్మ పరమేశ్వరి ఆలయంలో హుండీ కానుకలు లెక్కిస్తున్న సిబ్బంది

సూళ్లూరుపేట: సూళ్లూరుపేట చెంగాళమ్మ పరమేశ్వరి అమ్మవారి బ్రహ్మోత్సవాలు బుధవారం ముగియడంతో గురువారం సుడిమాను అవరోహణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయ చైర్మన్ దువ్వూరు బాలచంద్రారెడ్డి, ఈఓ ఆళ్ల శ్రీనివాసులురెడ్డి ఆధ్వర్యంలో కోళ్లమిట్టకు చెందిన వారు సంప్రదాయబద్ధంగా పూజలు చేసి సుడిమానును అక్కడి నుంచి తొలగిం కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. సుడిమాను వేరు వేరుగా విడిదీసి గోదాముల్లో భద్రపరిచారు.

హుండీ ఆదాయం రూ.22.49 లక్షలు

సూళ్లూరుపేట చెంగాళమ్మ పరమేశ్వరి ఆలయ బ్రహ్మోత్సవాల సమయంలో హుండీ ఆదాయం రూ.22,49,481 వచ్చినట్టు చైర్మన్ దువ్వూరు బాలచంద్రారెడ్డి, ఈఓ ఆళ్ల శ్రీనివాసులురెడ్డి తెలిపారు. గూడూరు దేవదాయ ఇన్‌స్పెక్టర్ సీహెచ్ శ్రీనివాసులు పర్యవేక్షణలో గురువారం హుండీలను లెక్కించారు. బ్రహ్మోత్సవాలకు ముందు గత నెల 30న హుండీలను లెక్కించారు. అంటే 17 రోజులకు గాను రూ.22.49 లక్షల ఆదాయం వచ్చిందని తెలి పారు. కార్యక్రమంలో ఎం చంద్రశేఖర్‌రెడ్డి, వంకా దినేష్‌కుమార్, ఓలేటి బాలసత్యనారాయణ, కర్లపూడి సురేష్‌బాబు, బండి సునీత, ఎం పద్మజ, ఎస్ నాగమణి, పీ మారెమ్మ పాల్గొన్నారు.

పలువురు సీఐల బదిలీ

తిరుపతి క్రైం: అనంతపురం రేంజ్ పరిధిలో పలువురు సీఐలను బదిలీ చేస్తూ డీఐజీ అమ్మిరెడ్డి గురువారం ఉత్తర్వులు జారీచేశారు. అనంతపురం వీఆర్‌లో ఉన్న మురళీమోహన్‌రావును యూనివర్సిటీ సీఐగా, ఇక్కడ పనిచేస్తున్న రవీందర్‌నాథ్‌ను తిరుపతి వీఆర్‌కు బదిలీ చేశారు. అదేవిధంగా అనంతపురం వీఆర్‌లో ఉన్న వెంకటేశ్వర్లును తిరుపతి క్రైమ్ సీఐగా, తిరుపతి పీసీఆర్ సీఐ లక్ష్మీకాంత్‌రెడ్డిని తాడిపత్రి రూరల్ సీఐగా, అక్కడ పనిచేస్తున్న చిన్న పెద్దయ్యను శ్రీసిటీ సీఐగా బదిలీ చేశారు. అదేవిధంగా అనంతపురం సీసీఎస్‌లో పనిచేస్తున్న రామకృష్ణను అనంతపురం వీఆర్‌కు తరలించారు.

కుప్పానికి చెవిలో పువ్వు!

- ఎన్నికలు సమీపిస్తున్న వేళ హామీల వర్షం
- ఎన్నికల్లో అభ్యర్థి మీరేనంటూ ఇద్దరు నేతలకు హామీ
- నేతలను పార్టీలో చేర్చుకోవడం.. ఆపై వదిలేయడం పరామామూలే
- కుప్పం ప్రజలను విస్మరిస్తున్న చంద్రబాబు



సాక్షి, తిరుపతి: చిత్తూరు జిల్లాలోని కుప్పం నియోజకవర్గం స్థానిక ఎమ్మెల్యే, ప్రతిపక్ష నేత నారా చంద్రబాబునాయుడు మోసపూరిత హామీలతో తడిసిముద్దవుతోంది. మూడు రోజుల పర్యటనలో భాగంగా బుధవారం కుప్పంకు చేరుకున్న ఆయన గురువారం కూడా అదే పంథాలో అలవికాని హామీలు గుప్పించారు. కొందరికి టీడీపీ కండువాలు కప్పి పార్టీలో చేరినట్లు ప్రకటించారు. ఇందులో టీడీపీ నేతలు కూడా ఉండడం చూసి అక్కడి వారు నవ్వుకున్నారు.

నాడు అలా..

'ఇవే నా చివరి ఎన్నికలు.. టీడీపీలో చేరినా..చేరకపోయినా.. గెలుపునకు సహాయం చేసినా చేయకపోయినా.. 2024లో కుప్పం టీడీపీ అభ్యర్థి నువ్వే' అని అంటూ 2018లోనే జెడ్పీ మాజీ చైర్మన్, అప్పటి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు సుబ్రమణ్యంరెడ్డికి హామీ ఇచ్చారు. ఆపై 2019 ఎన్నికల్లో ఆయన్ను టీడీపీ నాయకులు కరివేపాకులా వాడుకుని వదిలేశారు.

నేడు ఇలా..

ఇప్పుడు చంద్రబాబు అదేతరహాలో మాజీ డీసీసీ అధ్యక్షుడు, ఏఐసీసీ సభ్యుడు డాక్టర్ బీఆర్‌డీ సురేష్‌కి హామీ ఇచ్చారు. 'నాకు వయసైపోయింది. ఇవే నా చివరి ఎన్నికలు. ఈ ఎన్నికల్లో నాకు సహాయం చేస్తే.. 2029 కుప్పం టీడీపీ అభ్యర్థి నువ్వే' అని హామీ ఇచ్చారనే ప్రచారం కుప్పంలో జరుగుతోంది. అందులో భాగంగానే డాక్టర్ సురేష్‌బాబు గురువారం టీడీపీ కండువా కప్పుకున్నారు.

ప్రతిసారీ బురిడీ

స్థానికులు ఎక్కువశాతం మంది పక్కనే ఉన్న బెంగళూరుకు వెళ్లి వస్తుంటారు. ఏపీలో ఉన్నా.. వ్యాపార లావాదేవీలు, ఉద్యోగాలు, కూలి పనుల కోసం బెంగళూరుపై ఆధారపడుతారు. అటువంటి ఓటర్లను దృష్టిలో ఉంచుకుని చంద్రబాబు కుప్పాన్ని బెంగళూరు శాటిలైట్ టౌన్‌గా చేస్తానని ప్రతి ఎన్నికలకు ముందు ఇచ్చే హామీ. అంటే.. ఉపాధి కోసం బెంగళూరు వెళ్లే అవకాశం లేకుండా అక్కడి పరిశ్రమలు, ఐటీ సంస్థలను కుప్పానికి తీసుకొచ్చి.. ప్రత్యేక సదుపాయాలతో పట్టణాన్ని తీర్చిదిద్దుతామని హామీ ఇస్తారు. అయితే 14 ఏళ్లు సీఎంగా ఉన్నా, ఎమ్మెల్యేగా ఉన్నా ఏ ఒక్క భారీ పరిశ్రమను, ఐటీ సంస్థను తీసుకొచ్చిన దాఖలాలు లేవు.

బాబు బడాయి!

- 2016లో సీఎం హోదాలో కుప్పానికి వచ్చిన చంద్రబాబు నాయుడు నియోజకవర్గంలో రూ.3వేల కోట్ల పెట్టుబడులు వస్తున్నాయని ఊదరగొట్టారు. మరో రూ.700 కోట్లతో రష్యా సహకారంతో వంద మెట్రిక్ టన్నుల ప్రాసెసింగ్ సామర్థ్యం ఉన్న ఆహార శుద్ధి పరిశ్రమ తీసుకొస్తున్నట్లు సీఎం హోదాలో ప్రకటించి మిన్నకుండిపోయారు.
- 1994 ఎన్నికల ముందు చంద్రబాబు ఇచ్చిన హామీల్లో.. ప్రతి ఇంటికీ రెండు పాడి ఆవులు, ఒక ఉద్యోగం. ఆ ఎన్నికల్లో చంద్రబాబు మొదటిసారిగా మంత్రి అయ్యారు. 1995లో ఎన్టీఆర్‌కి వెన్నుపోటు పొడిచి ముఖ్యమంత్రి అయ్యారు. అయినా ఏ ఒక్క హామీ నెరవేర్చలేదు.
- 2014 ఎన్నికల ముందు ప్రతి మండలంలో పదివేల మందికి ఉపాధి కల్పించే విధంగా పరిశ్రమలు ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారు. అదేవిధంగా ప్రతి మండలంలో మినీ స్టేడియం నిర్మిస్తానని ప్రకటించారు. ఇంకా మండలానికి ఒక రైతుబజార్, పేదలందరికీ డీకేటీ భూముల పంపిణీ వంటి హామీల్లో ఏ ఒక్కటీ అమలైన దాఖలాలు లేవు.

● బంగారు వర్ణం..భానుడి కిరణం



సాయంసంధ్యావేళ భానుడి కిరణాలు కరిమబ్బుల మాటున బంగారు వర్ణంలో మెరిసిపోయాయి. ఉదయం నుంచి నిప్పులు చెరిగిన సూరీడు సాయంత్రం అలసిసొలసినట్టు లేలేత వర్ణాలతో కనువిందు చేశాడు. నైరుతీ రుతుపవనాలు విస్తరిస్తున్న నేపథ్యంలో నల్లటి మబ్బుల చాటున చేరి సువర్ణ వర్ణాలను వెదజల్లుతూ ఆకట్టుకున్నాడు. ఈ సుందర దృశ్యాన్ని గురువారం కరకంబాడి వద్ద పలువురు తమ సెల్‌ఫోన్లలో బంధించడం కనిపించింది.

– షేక్ మహ్మద్ రఫీ, సాక్షి ఫొటోగ్రాఫర్, తిరుపతి

హెల్త్ స్కీంకు దరఖాస్తు చేసుకోండి

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా వ్యాప్తంగా ఉన్న వర్కింగ్ జర్నలిస్టులు హెల్త్‌స్కీంకు దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ షణ్మోహన్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలో 2023–24 కాలపరిమితితో అక్రిడిటేషన్ పొందిన జర్నలిస్టులు హెల్త్‌స్కీంకు దరఖాస్తులు చేసుకోవాలన్నారు. www.cfms.ap.gov.in వెబ్‌సైట్‌లో డీడీవో కోడ్ 2703–0802–003 ద్వారా హెడ్‌ఆఫ్ అకౌంట్ 8342–00–120–01–03–001 పద్దుకు రూ.1250 చెల్లించి 31–03–2024 వరకు ఈ పథకం లబ్ధి పొందవచ్చన్నారు. ప్రీమియం చెల్లించిన జర్నలిస్టులు ఒరిజినల్ చలానా, గతంలో జారీ చేసిన హెల్త్ కార్డు జిరాక్స్, ప్రస్తుత అక్రిడిటేషన్ కార్డు జిరాక్స్ కాపీలను కలెక్టరేట్‌లోని జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారి కార్యాలయంలో అందజేయాలని సూచించారు. వర్కింగ్ జర్నలిస్ట్ హెల్త్ స్కీం ప్రీమియం రూ.2,500 కాగా ఇందులో జర్నలిస్టు వాటా రూ.1,250, ప్రభుత్వం వాటా రూ.1,250గా ఉంటుందన్నారు. జర్నలిస్ట్ హెల్త్ స్కీమ్ వల్ల జర్నలిస్టులు, కుటుంబ సభ్యులకు ఏదైనా అనుకోని అనారోగ్యం సంభవించిన ప్రతిసారి రూ.2 లక్షల వరకు వైద్యసేవలు ఉచితంగా పొందవచ్చని తెలిపారు. ఇలా సంవత్సర కాలంలో ఎన్నిసార్లైనా పరిమితి లేకుండా ఈ సదుపాయాన్ని అందిస్తారన్నారు. వర్కింగ్ జర్నలిస్ట్ హెల్త్ స్కీమ్‌ను ఎంప్లాయీస్ హెల్త్ స్కీమ్ (ఈహెచ్ఎస్) తరహాలో జర్నలిస్టులు వైద్య సేవలు పొందవచ్చన్నారు. వర్కింగ్ జర్నలిస్ట్ హెల్త్ స్కీమ్ పొందే వైద్యసేవల విషయంలో ఎలాంటి ఆదాయ పరిమితులు లేవని తెలిపారు. అక్రిడిటేషన్ పొందిన జర్నలిస్టులందరూ ఈ సదుపాయాన్ని వినియోగించుకోవాలని కలెక్టర్ ఆ ప్రకటనలో కోరారు.

ఆరోగ్య వివరాలు సమర్పించాలి

చిత్తూరు రూరల్: జిల్లాలోని ఆర్టీసీ ఉద్యోగులు విధిగా ఆరోగ్య వివరాలను డిపో అధికారులకు సమర్పించాలని డీపీటీఓ జితేంద్రనాథ్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రెండు రోజుల్లో ఆరోగ్య వివరాలను పక్కాగా ఇవ్వాలని అందులో స్పష్టం చేశారు.

జగనన్న పాలన దేశానికే ఆదర్శం

- అర్హులైన నిరుపేదలకు సంక్షేమ పథకాలు
- చిత్తశుద్ధితో అభివృద్ధికి చర్యలు
- గడప గడపకూ మహా పాదయాత్రలో చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి


తాపీమేస్త్రి పనులు చేస్తున్న చెవిరెడ్డి మోహిత్ రెడ్డి


రిక్షా తొక్కుతున్న మోహిత్‌రెడ్డి

పాకాల : అర్హులైన నిరుపేదలకు రాజకీయాలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందజేస్తూ దేశంలోనే సీఎం జగన్ పాలన ఆదర్శంగా నిలుస్తోందని చంద్రగిరి వైఎస్‌ఆర్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి తెలిపారు. గురువారం పాకాల పంచాయతీలో నాల్గో రోజు గడప గడపకు మహాపాదయాత్ర కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. శివశక్తి నగర్, సంతగేటు వీధి, ఎల్బీఎస్ నగర్, భారతం మిట్ట ప్రాంతాల్లో ఇంటింటికీ వెళ్లి సమస్యలు తెలుసుకున్నారు.

ప్రజలతో మమేకం

గడప గడపకు మహా పాదయాత్ర కార్యక్రమంలో మోహిత్‌రెడ్డి ప్రజలతో మమేకమయ్యారు. లబ్ధిదారులకు ప్రభుత్వ పథకాల బుక్‌లెట్‌ను అందజేశారు. సీఎం జగన్, ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి పాలనలో సంక్షేమ సాధికారత నెలకొందన్నారు. సంక్షేమ పథకాలు అందుతున్నాయా..? అంటూ ఆరా తీశారు. ఇంకా ఏమైనా సమస్యలు ఉంటే చెప్పాలని అభ్యర్థించారు. 2024 ఎన్నికల్లో ఎమ్మెల్యే అభ్యర్థిగా తనకు అవకాశం ఇచ్చారని, తప్పక ఆదరించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. రిక్షా కార్మికుడు పెరుమాల్‌తో కాసేపు ముచ్చటించారు. తర్వాత రిక్షా తొక్కుతూ ఆకట్టుకున్నారు. బంగారు దుకాణంలో ఆభరణాలకు మెరుగులు అద్దుతూ.. భవన నిర్మాణ కార్మికులతో ముచ్చటించారు. కూలీలతో కలిసి తాపీ చేతబట్టి భవన నిర్మాణ పనుల్లో పాల్గొన్నారు.

అందరూ ఉన్నా అనాథగా..

సంతగేటు వీధికి చెందిన వేల్‌శెట్టి అందరూ ఉన్న అనాథగా నిలిచాడు. వృద్ధాప్యంలో భార్య, భర్త ఒంటరిగా జీవనం సాగిస్తున్నారు. మోహిత్‌రెడ్డి పర్యటనలో వేల్ శెట్టి తన ఇబ్బందులను, ఆవేదనను తెలియజేశారు. తనకు అనారోగ్యం కారణంగా ఎడమ కాలును తొలగించారన్నారు. ప్రతి నెలా ప్రభుత్వం అందించే పింఛన్, 10 కిలోల రేషన్ బియ్యంతో జీవనం సాగిస్తున్నట్టు వెల్లడించారు. రేషన్ సరఫరాలో ఇబ్బందులను తెలియజేశారు. స్పందించిన మోహిత్ రెడ్డి సంబంధిత అధికారులతో మాట్లాడారు. రేషన్ బియ్యం లబ్ధిదారుల ఇంటి వద్దకే చేర్చేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అంతేకాకుండా వేల్‌శెట్టికి ట్రైసైకిల్ అందించి మానవత్వాన్ని చాటుకున్నారు.

చిత్తశుద్ధితో అభివృద్ధి

ఎన్నికల సమయంలోనే రాజకీయం చేయాలి..! మిగిలిన కాలమంతా ప్రజా ప్రయోజనాలకు పాటుపడాలి అని తన తండ్రి, ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి సూచనలను తప్పక పాటిస్తానని మోహిత్‌రెడ్డి పేర్కొన్నారు. ఓటు వేసిన వారికైనా.. ఓటు వేయని వారికై నా.. ప్రజలు ఎన్నుకున్న తరువాత ఆ నియోజకవర్గానికి ఎమ్మెల్యే హోదాలో ప్రజాప్రతినిధిగా అందరికీ న్యాయం చేయాల్సిన గురుతర బాధ్యత ఉంటుందని తెలియజేశారన్నారు. సీఎం జగన్ ఆశయ సాధనకు తన వంతు బాధ్యతగా కృషి చేస్తానని స్పష్టం చేశారు. కార్యక్రమంలో మోహిత్‌రెడ్డి వెంట అధికారులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

క్లుప్తంగా

రైళ్ల రాకపోకలకు ఏడు గంటలు అంతరాయం

నాయుడుపేటటౌన్: జాతీయ రహదారి విస్తరణ పనుల్లో భాగంగా నాయుడుపేట రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద గురువారం మధ్యాహ్నం నుంచి సాయంత్రం 7 గంటల వరకు రైలు పట్టాల వద్ద మరమ్మతు పనులు చేపట్టారు. దీంతో సుమారు ఏడు గంటల పాటు రైళ్ల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగింది. నాయుడుపేట వైపు రాకపోకలు జరిపే పలు ఎక్స్‌ప్రెస్ రైళ్లు గూడూరు, సూళ్లూరుపేట రైల్వేస్టేషన్లలో నిలిపి వేశారు. పినాకిని ఎక్స్‌ప్రెస్‌తో పాటు పలు రైళ్లు సూళ్లూరుపేటలో నిలిపి వేశారు. సాయంత్రం నాలుగు గంటలకు రావాల్సిన పినాకిని ఎక్స్‌ప్రెస్ రైలు ఏడు గంటలకు పైగా నాయుడుపేటకు వచ్చింది. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

పొలాలపై ఏనుగుల దాడి


పాతపేటలో ఏనుగులు ధ్వంసం చేసిన డ్రిప్ పరికరాలు

పులిచెర్ల(కల్లూరు): మండలంలోని పాతపేటలో బుధవారం రాత్రి ఏనుగులు పంటపొలాలపై దాడిచేశాయి. మామిడి చెట్లు, కొబ్బరి చెట్లు విరిచేశాయి. పొలాల్లో అమర్చిన డ్రిప్ పరికరాలను తొక్కి ధ్వంసం చేయడంతో రైతులకు భారీగా నష్టం చేకూరింది.



బంగారం :	
24 క్యారెట్లు 10 గ్రాములు	రూ.60,720
22 క్యారెట్లు ఒక గ్రాము	రూ.5,453
వెండి:	
హోల్‌సేల్ ధర (కిలో)	రూ.73,100
రిటైల్ వెండి గ్రాము	రూ.75.10

తెలుగుగంగ కాలువలో పడి ఒకరి మృతి


లక్ష్మణ ప్రసాద్ (ఫైల్)

తొట్టంబేడు(శ్రీకాళహస్తి): మండలంలోని తెలుగుగంగ కాలువలో పడి ఒకరు మృతి చెందినట్లు ఘటన గురువారం చోటు చేసుకుంది. ఎస్ఐ రాఘవేంద్ర కథనం.. మధ్యప్రదేశ్‌కు చెందిన లక్ష్మణప్రసాద్(35) ఓ ప్రయివేటు కంపెనీలో సెక్యూరిటీగా విధులు నిర్వహిస్తున్నాడు. చిట్టత్తూరు సమీపంలో ఉదయం కాలకృత్యాలు తీర్చుకునేందుకు తెలుగుగంగ కాలువలో దిగి కాలుజారి ప్రవాహంలో మునిగిపోయాడు. తోటి కార్మికులు పోలీసులకు సమాచారం అందించంగా చిట్టుత్తూరు సమీపంలోని కొత్తకండ్రిగ వద్ద మృతదేహం లభ్యమైంది. పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ఏరియా ఆస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది. మృతునికి ఇంకా వివాహం కాలేదు.

మాదకద్రవ్యాలపై ఉక్కుపాదం

- కేసుల ఇన్వెస్టిగేషన్లో నిబంధనలు పాటించాలి
- పాత నేరస్తులను బైండోవర్ చేయాలి
- సమీక్షలో ఎస్పీ రిశాంత్‌రెడ్డి


సమీక్షలో మాట్లాడుతున్న ఎస్పీ రిశాంత్ రెడ్డి

చిత్తూరు అర్బన్: మాదక ద్రవ్యాలపై ఉక్కుపాదం మోపాలని ఎస్పీ రిశాంత్ రెడ్డి ఆదేశించారు. చిత్తూరు నగరంలోని పోలీసుల అతిథి గృహంలో గురువారం ఎస్ఈబీ అధికారులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఎస్పీ మాట్లాడుతూ కేసుల ఇన్వెస్టిగేషన్లో నిబంధనలు పాటిస్తూ సాంకేతిక పరిజ్ఞానంతో దర్యాప్తు వేగంగా పూర్తి చేసి నిందితులకు శిక్ష పడేలా చేయాలని పిలుపునిచ్చారు. నిఘా వ్యవస్థను బలోపేతం చేసి గంజాయి, నాటు సారా తయారీ, అక్రమ మద్యం రవాణాను అరికట్టాలని చెప్పారు. డ్రగ్స్ నిందితులను, మాదకద్రవ్యాలు సేవించే వారిని గుర్తించి తగు చర్యలు తీసుకోవాలన్నారు. పాత నేరస్తులను బైండోవర్ చేయాలని సూచించారు. నాటుసారా తయారీ, విక్రయ కేంద్రాలపై ప్రత్యేక నిఘా పెట్టాలని స్పష్టం చేశారు. గ్రామాల్లో మహిళా పోలీసుల ద్వారా సమాచార వ్యవస్థను మరింత బలోపేతం చేయాలని పేర్కొన్నారు. అక్రమ మద్యం, గంజాయి, నాటుసారా, అక్రమ ఇసుక, నిషేధిత మత్తుపదార్థాల రవాణా, ఇతర అసాంఘిక కార్యక్రమాలను అరికట్టేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. ఎస్ఈబీ అడిషనల్ ఎస్పీ శ్రీలక్ష్మి, అధికారులు ఆయేషా బేగం తదితరులు పాల్గొన్నారు.

చీటింగ్ కేసులో ఆరుగురికి జైలు


శిక్షపడిన నిందితులతో పోలీసులు

వరదయ్యపాళెం: శ్రీసిటీ పారిశ్రామికవాడలోని వీఆర్‌వీ పరిశ్రమలో ఇనుప ముడిసరుకు కొనుగోళ్లకు సంబంధించి తూకంలో మోసం చేసి లక్షల విలువైన ఇనుప ముడిసరుకును తీసుకెళ్లి పరిశ్రమకు లక్షల్లో నష్టాన్ని చేకూర్చిన కేసులో ఆరుగురి నిందితులకు జైలుశిక్ష, రూ.5వేల జరిమానాను విధిస్తూ సత్యవేడు కోర్టు తీర్పునిచ్చింది. ఈ ఘటనకు సంబంధించి 2016లో పరిశ్రమ యాజమాన్యం ఇచ్చిన ఫిర్యాదు మేరకు సెక్షన్ 420 కింద చీటింగ్ కేసు నమోదైంది. ఈ కేసులో ఆరుగురు నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ కేసుకు సంబంధించి పూర్తిస్థాయిలో ఆధారాలు, సాక్ష్యాలను కోర్టుకు తెలియజేయడంతో గురువారం పుర్వాపరాలను పరిశీలించిన సత్యవేడు కోర్టు ఫస్ట్‌క్లాస్ న్యాయమూర్తి ముద్దాయిలను దోషులుగా తేల్చుతూ శిక్షను ఖరారు చేశారు. శిక్ష పడిన వారిలో ముద్దాయిలు చెన్నైకి చెందిన హకీం భాషా (24), జాకీర్ హుస్సేన్ (32), షాహుల్ హమీద్ (26), మహ్మద్ రఫీ (30), నాగలాపురం మండలం, బీరకుప్పం గ్రామానికి చెందిన రామరాజు (25), సత్యవేడు మండలం, మాదనపాళెం గ్రామానికి చెందిన చెంగయ్య (26) ఉన్నారు.

నీట్‌లో విశ్వసాయి ప్రభంజనం


సత్తాచాటిన విద్యార్థులతో కళాశాల చైర్మన్

నెల్లూరు (టౌన్) : నీట్ ఫలితాల్లో విశ్వసాయి విద్యాసంస్థల విద్యార్థులు ప్రభంజనం సృష్టించారని కళాశాల చైర్మన్ సత్యనారాయణ, వైస్ చైర్మన్ కృష్ణమోహన్ తెలిపారు. నెల్లూరు మాగుంట లేఅవుట్‌లోని కళాశాలలో ఆలిండియా స్థాయిలో ర్యాంకులు సాధించిన విద్యార్థులను బుధవారం వారు అభినందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కె.జీవన్‌రెడ్డి 613, సుహిత 598, నిధి 597 మార్కులు సాధించారని చెప్పారు. ఒకే కళాశాల నుంచి 101 మంది విద్యార్థులు ఎంబీబీఎస్, బీడీఎస్‌ల్లో చేరేందుకు అర్హత సాధించారన్నారు. ఒత్తిడి లేని విద్య, విద్యార్థుల పట్టుదలే ఈ విజయానికి కారణమన్నారు.

ఉరి వేసుకుని వ్యక్తి ఆత్మహత్య

గూడూరు రూరల్: గూడూరు రూరల్ పరిధి నెలటూరు గ్రామంలో రెండు రోజుల క్రితం ఆత్మహత్యకు పాల్పడిన వ్యక్తి మృత దేహాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచార ఇచ్చారు. పోలీసుల వివరాల మేరకు.. రాజమండ్రి ప్రాంతానికి చెందిన గణేష్(29) కొంత కాలం క్రితం కేరళా రాష్ట్రంలో పనుల నిమిత్తం వెళ్లాడు అక్కడ పనులు చేసుకునే సమయంలో పరిచయమైన ఓ మహిళను తీసుకుని నెలటూరు ఎస్టీ కాలనీలో మూడు నెలల నుంచి సహజీవనం చేస్తున్నాడు. ఈ క్రమంలో వారి మధ్య నెలకొన్న మనస్పర్థల కారణంగా ఐదు రోజుల క్రితం ఆమె ఎటో వెళ్లిపోయింది. దీంతో మనస్తాపం చెందిన గణేష్ ఇంట్లో ఉరివేసుకుని మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గూడూరు ఏరియా ఆస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.

బకాయిలు చెల్లించాలి

చిత్తూరు కార్పొరేషన్: ఉమ్మడి జిల్లాలోని ప్రభుత్వ కార్యాలయాల విద్యుత్ బకాయిలు చెల్లించాలని అధికారులు నోటీసులు జారీ చేశారు. ఉమ్మడి జిల్లాలో పలు సంవత్సరాలుగా 44 వేల సర్వీసులకు గాను రూ.1000 కోట్లు బిల్లు పెండింగ్‌లో ఉంది. వీటిని దశల వారీగా చెల్లించాలని ఆదేశాలు జారీ చేశారు. లేనిపక్షంలో శాఖాపరంగా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు.

భర్తే హత్యచేశాడా?


మృతురాలు సంధ్య

కేవీబీపురం: భర్త చేతిలో భార్య హత్యకు గురైందంటూ మృతురాలి బంధువులు పోలీసులకు ఫిర్యాదు చేసిన ఘటన కేవీబీపురం మండలం, రాయపేడు గ్రామంలో గురువారం చోటుచేసుకుంది. ఎస్ఐ సునీల్ తెలిపిన వివరాల మేరకు.. మండలంలోని రాయపేడు దళితవాడకు చెందిన సంధ్య(27) తన ఇంట్లో అనుమానాస్పదంగా మృతిచెంది ఉండడాన్ని కుటుంబ సభ్యులు గమనించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్ఐ సునీల్ వివరాలపై ఆరాతీశారు. మృతురాలు అదే గ్రామానికి చెందిన ఆనంద్‌ను ప్రేమ వివాహం చేసుకుంది. వీరిమధ్య తరచూ వివాదాలు తలెత్తేవి. ఈ క్రమంలో బుధవారం గ్రామంలో జరిగిన ఒక కార్యక్రమానికి హాజరై ఇంటికి వెళ్లిన సంధ్య తెల్లవారే సరికి విగతజీవిగా పడిఉంది. భర్త ఆనంద్ సంధ్యను హత్యచేశాడని మృతురాలి బంధువులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. మృతురాలి శరీరంపై ఉరిబిగించిన ఆనవాళ్లు ఉన్నట్లు సంధ్య బంధువులు పోలీసులకు తెలిపారు. ఆమె భర్తను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

తిరుమలలో అన్యమత వ్యాఖ్యలతో వాహనం హల్‌చల్

తిరుమల : అన్యమత వ్యాఖ్యలు కలిగిన స్టిక్కర్‌తో ఓ వాహనం తిరుమలలో తిరుగుతూ హల్‌చల్ చేసిన సంఘటన గురువారం సాయంత్రం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. శ్రీవారి దర్శనార్థం కొందరు భక్తులు కారులో తిరుమలకు చేరుకున్నారు. వీరి వాహనం వెనుక అన్యమతానికి సంబంధించిన వ్యాఖ్యలు కనపడడంతో భక్తులు టీటీడీ విజిలెన్స్‌కు ఫిర్యాదు చేశారు. వెంటనే విజిలెన్స్ సిబ్బంది వారిని అదుపులోకి తీసుకుని ప్రశ్నించగా తమకు అన్యమత చిహ్నాలపై నిషేధం ఉన్న విషయం తెలియదని, తాము శ్రీవారి పరమభక్తులమని వివరించారు. అనంతరం కారుపై ఉన్న అన్యమత వ్యాఖ్యల స్టిక్కర్‌ను తొలగించారు.

నూతన ఆలయ పునర్నిర్మాణానికి శ్రీకారం


పురాతన ఆలయ తొలగింపు కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న అధికారులు

నింద్ర: మండల కేంద్రంలోని ప్రాచీన ప్రసన్న వేంకటేశ్వర ఆలయ పునర్నిర్మాణానికి టీటీడీ అధికారులు గురువారం శ్రీకారం చుట్టారు. గతంలో గ్రామస్తులు ఆలయాన్ని నిర్మించాలని మంత్రి రోజా దృష్టికి తీసుకెళ్లడంతో, ఆమె టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డితో మాట్లాడి, ఆలయ నిర్మాణానికి 1.7 కోట్లు మంజూరు చేయించారు. ఇందులో బాగంలో అధికారులు పరిశీలించి నిర్మాణ పనులను కాంట్రాక్టర్లకు అప్పగించారు. ఆలయ పునర్నిర్మాణ పనులు స్థానిక తహసీల్దార్, పోలీసుల పర్యవేక్షణలో ప్రారంభమయ్యాయి.

ఐసెట్ ఫలితాల్లో జిల్లా విద్యార్థుల ప్రతిభ

తిరుపతి ఎడ్యుకేషన్ : ఎంబీఏ, ఎంసీఏ కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించిన ఐసెట్-2023 ప్రవేశ పరీక్ష ఫలితాలను గురువారం అనంతపురంలోని శ్రీకృష్ణదేవరాయ యూనివర్సిటీ ప్రకటించింది. ఈ ఫలితాల్లో తిరుపతి జిల్లా విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచారు. ఈ పరీక్షను తిరుపతి జిల్లా పరిధిలో తిరుపతి, గూడూరు, పుత్తూరులో ఏర్పాటుచేసిన పరీక్షా కేంద్రాల్లో నిర్వహించారు. తిరుపతి కేంద్రంగా నిర్వహించిన ఈ పరీక్షకు 2,300మంది దరఖాస్తు చేసుకోగా వారిలో 2,108మంది పరీక్షకు హాజరయ్యారు. వీరిలో 1,958మంది ఉత్తీర్ణత సాధించారు. గూడూరు కేంద్రంగా జరిగిన పరీక్షకు 650మంది దరఖాస్తు చేసుకోగా, వారిలో 583మంది పరీక్షకు హాజరయ్యారు. వీరిలో 548మంది ఉత్తీర్ణత సాధించారు. అలాగే పుత్తూరులో జరిగిన 1,160మంది దరఖాస్తు చేసుకోగా, 1,025మంది పరీక్షకు హాజరయ్యారు. వీరిలో 956మంది ఉత్తీర్ణత సాధించారు.